
ఆతిథ్యమిచ్చిన ఆ స్త్రీమూర్తి కథ వెనుక దాగిన మర్మం ఏమిటి?

# నిజం దాగదు

## బద్దిగం పాండురంగా రెడ్డి కథ

గతుకుల రోడ్డుమీద ప్రయాసపడుతూ ప్రయాణించిన లారీ ఒక్కసారి ఆగింది. ఆలోచనలలోనుండి తేరుకుని డ్రైవరువంక చూశాను. "బాబూ! ఇదే 'రాజుపాలెం'. ఇక్కడినుండి ఒక ఫర్లాంగు దూరం నడిచారంటే ఊరొచ్చేస్తుంది. ఈ రాత్రి ఇక్కడే ఎక్కడో భోజనం చేసి గడిపారంటే రేపు ప్రొద్దుట ఇక్కడే 8 గంటలకు కోటపాలెం పోయే బస్సు దొరుకుతుంది. దానిమీద కోటాపాలెం వెళ్లవచ్చు. మేమే మిమ్మల్ని తీసుకెళ్లేవాళ్లము. కానీ మేమూ దారి ఈ రాత్రి వెళ్లడంలేదు. ఇక్కడినుండి పట్నంవైపు వెళ్లిపోతున్నాము" అన్నాడు డ్రైవరు — ఇక మీరు దిగవచ్చు అన్నట్టు.

ట్రావెలింగ్ బ్యాగ్‌నందుకుని లారీనుండి దిగాను. నేను వెలువరించిన కృతజ్ఞతలనందుకుని లారీ డ్రైవర్ పట్నంవైపు మరలాడు — ఇక తన బాధ్యత తీరిందన్నట్టు. లారీ కంటికి కనిపించేంతవరకూ చూచి రాజుపాలెంవైపు దృష్టి సారించాను. రాత్రి 9 గంటలవకముందే పల్లె నిద్రకుపక్రమించింది. అక్కడక్కడ ఇళ్లలో దీపాలు జోగుతున్నాయి. ముక్కూ ముఖం తెలియని పల్లెలో రాత్రి ఎలా గడుస్తుందిరా భగవంతుడా అనుకుంటూ ఆకాశంవైపు చూచాను. నేనేం చేస్తానో చూడాలన్నట్టు కాబోలు నావైపే అన్ని చుక్కలు కళ్లు ఇంతలు చేసుకుని చూస్తున్నాయి. చంద్రుడు నాకు అభయమిస్తున్నట్టు మబ్బుల్లోంచి ఇవతలకొచ్చి మల్లెపువ్వులాంటి వెన్నెలను అంతటా విరజిమ్మాడు. నిద్రపోతున్న పల్లెవంక మళ్లా చూచాను. నేనున్న చోటునుండి సుమారు ఒక ఫర్లాం



గు దూరంలో మిణుకుమిణుకుమనే దీపాల
లో చలికి ముదుచుకుని పడుకున్న పల్లె
లీలగా కనిపించింది. ట్రావెలింగ్ బ్యాగందు
కుని ముందుకు రెండడుగులు వేశాను.
ఎముకలు కొరికే చలిగాలి రివ్వున వీచింది.
మఫ్లరు చెవులమీద చుట్టుకుని రాజుపాలెంవై
పు నడిచాము — వెన్నెల్లో దారి చూసుకుం
టూ. 'కిళ్లీ కొట్టు ఏదైనా తెరిచి వుండదా?

ఆ కొట్టులో ఒక అరడజను అరటిపళ్లయినా దొరక్కపోవా?' వాటిని తినేసి ఏ కిళ్లీకొట్టు బడ్డీమీదో నిద్రపోదామని నిర్ణయించుకున్నాను.

ఇంత శ్రమ అంతాను పెళ్లిచేసుకోనని మొండికేసి చివరకు గప్‌చిప్‌గా పెళ్లిచేసుకుని సంసారం వెలగబెడుతున్న మా ప్రభాకరాన్ని, వాడి సుపుత్రుణ్ని చూద్దామనే. నేనూ, ప్రభాకర్ కాకినాడలో ఇంటర్ వరకు చదువుకున్నాం. నేను ఇంజనీరింగ్ చదువుకోవడానికని వచ్చివేశాను. ప్రభాకర్ బియ్యేలో ప్రవేశించి కొంతకాలం చదువు సాగించి ఎందుకో చదువు మానేసి వ్యవసాయం చూసుకుంటూ ఇంటివద్దనే వుండిపోయాడు. మేము ఒకరికొకరం దూరమైనా అప్పుడప్పుడు ఉత్తరాల్లో కలిసేవారం. నేను ఇంజనీరింగ్ కోర్సు అయిన తరువాత బొంబాయిలో స్థిరపడిపోయేను. ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టడానికి ఏ రెండు మూడు సంవత్సరాలకోగాని వీలయ్యేది కాదు. సెలవు దొరికినా మా తమ్ముడి కుటుంబం దగ్గర రెండు రోజులు, ఇంటిదగ్గర ఒక వారం రోజులకన్నా ఎక్కువకాలం వుండడానికి అవకాశం దొరికేది కాదు. అలాంటి తక్కువ వ్యవధిలో 'కోటపాలెం' అనే పల్లెటూరిని వెదుక్కుంటూ వెళ్లాలంటే సాధ్యపడేది కాదు. ఈమారుమాత్రం క్రిస్టమస్ సెలవులను పూర్తిగా వినియోగపరుచుకోవాలని, శ్రీమతిని కూడా వెంట పెట్టుకుని, ఆమెను పిల్లల్ని విశాఖలో దిగవిడిచి ప్రభాకర్‌ని చూద్దామని బయలుదేరాను. కోటపాలెంకు సరాసరి మార్గం లేనందువల్ల, నే బయలుదేరిన చోటునుండి రాజపాలెం వెళ్లే బస్సుల టైమింగ్స్ తెలియని కారణంచేత కొంత శ్రమపడాల్సి వచ్చింది.

పల్లెలో ప్రవేశించాను. ఎక్కడా సడీ చప్పుడూ వినిపించడంలేదు. ఎరికి ఎవరింటిలో వారు ముసుగుపెట్టుకుని నిద్రపోయారు. అక్కడక్కడ పెంకుటిళ్లున్నా పశువులు కొన్ని నాకన్నా ముందు సీట్లు రిజర్వు చేసుకున్నాయి. తిందామన్నా తిండి లేకపోయినా, నిద్రపోవడానికి ఒక్క అరుగైనా దక్కకపోయిందికదా అని విచారిస్తూ ముందుకు నడిచాను. సుమారు పల్లె అంతా వెత్కే చేశాను. ఒక ఇంటిముందుకు రాగానే కుట్టుమిషన్ ఆడుతున్న 'టిక్ టిక్' అన్న శబ్దంవినిపించి ప్రాణం లేచివచ్చినట్లయింది. గట్టిగా ఊపిరి పీల్చుకుని 'ఏమండీ' అని పిలిచాను అరుగెక్కి.

ఏమీ సమాధానం రాలేదు. గొంతుక కొద్దిగా పెద్దది చేసి మళ్లీ పిలిచాను. 'ఎవరూ?' అన్న స్త్రీ కంఠం వినిపించింది. నెమ్మదిగా తలుపులు తెరుచుకున్నాయి. తలనిండా ముసుగు కప్పుకుని, చేతిలో హరికేన్ లాంతరు పుచ్చుకుని వీధిలోకి ప్రవేశించింది ఒక పాతికేళ్ల స్త్రీ. 'ఎవరుబాబూ?' అంటూ హరికేన్ లాంతరు వెలుగులో నన్ను పరీక్షగా చూచిందామె. ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్నట్టున్నవి ఆమె చూపులు. కొద్ది సేపట్లోనే ఆమె అందమైన ముఖంలో ఆనందపు రేఖలు వెలిశాయి. ఆమె పెదవులమీద మబ్బులమాటునుండి ఈవలకు వస్తున్న చంద్రుని వెన్నెలలాంటి సన్నని చిరునవ్వు వెలిసింది. ఆమె తన ఆలోచనలనుండి తేరుకోకముందే నేను అన్నాను.

''నేను చాలా దూరంనుండి ప్రయాణం చేసి వస్తున్నాను. మీరు అనుమతి ఇస్తే మీ అరుగుమీద ఈ రాత్రి విశ్రమించి రేపు తెల్లారే వెళ్లిపోతాను''

''అలాగా బాబూ. రండి. కాస్త భోజనం చేసి విశ్రాంతి తీసుకుందురుగాని'' అందామె ఇంటిలోకి రెండడుగులు వెనక్కు వేసి.

ఆమె దయకు కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియలేదు.

''అంత ఆతిథ్యం అక్కరలేదమ్మా. కాస్త ఈ రాత్రి ఈ అరుగుమీద నిద్రపోనివ్వండి. ఈ బ్యాగుమాత్రం లోపల పెట్టండి. అంతే చాలు'' అన్నాను.

''అలా వద్దుబాబూ! ఈ చలిరాత్రి మంచుగాలిలో నిద్రపోతాననటం మీకు భావ్యంకాదు. మిమ్మల్ని అలా వదిలివేయటం నాకూ ధర్మంకాదు. మీకోసం ప్రత్యేకంగా నే శ్రమించాల్సినదేదీ లేదు. మీరు కాళ్లూ చేతులు కడుక్కునేలోగా మీ భోజనం ఏర్పాట్లు చూస్తాను. మీరు మాత్రం భోజనం చేయండి. పస్తు వుండవద్దు. ఆ బ్యాగు ఇలా ఇవ్వండి'' అందామె. ఆమె చూపే దయ నా గుండెల్లో కృతజ్ఞతనిండిపోయింది. మోమాటం పడుతూనే బ్యాగు ఆమెకిచ్చి బట్టలుమార్చుకుని ఆమె చూపిన బావి దగ్గరకు వెళ్లాను. ఆమె వేడినీళ్లిస్తానని వారిస్తున్నా చన్నీళ్లు నెత్తిమీద దిమ్మరించుకున్నాను.

జీవితంలో నేనూహించని విధంగా ఎవరో తెలియని ఒంటిగా, వయసులో వున్న స్త్రీ నాకాతిథ్యమిస్తుంటే 'ఆమె ఎవరు? ఆమెది ఏ కులం? ఆమెకు సంఘంలో ఎలాంటి స్థానం వున్నది' అన్న విషయాలేవీ నా ఆలోచనకు రాలేదు. దానికామె చేసిన మర్యాద, మన్నన, అణుకువ, ముఖంలో అమాయకతతప్ప ఇంకేమీ కారణాలుకావు.


నేను పాడిబట్టలు కట్టుకునేలోగా, ఆమె విప్పుచేసి, ఒక కుంపటి మీద బంగాళాదుంపలు వేయించి పది నిమిషాలలో వంట పూర్తిచేసి నన్నుభోజనానికి కూర్చోమని

## అనుమానం

''నువ్వు నన్ను చెవి స్పెషలిస్టు దగ్గరకు ఎందుకు తీసుకెళ్లిందీ నాకు అర్థంకావడంలేదు'' కోపంగా అన్నాడు ఓ భర్త.

''మరేం లేదు. మీరు ఈ మధ్య నేను రాసిన కథలు, నవల్లు ఎంచక్కా [illegible] నేను అనుమానం వచ్చిందిలే'' చెప్పింది [illegible] భార్య.

— [illegible] (తెనాలి)



పిలించింది.

నొమ్ముకుంటూనే భోజనానికి ఉపక్రమించా ను. ఆమె నాకు కొంత దూరంలో చీకటిలో కూర్చుని నాకు కావలసిన అవసరాలు చూస్తోంది. నేను తలదించుకుని భోజనం చేస్తున్నాను.

మౌనంగా క్షణాలు గడిచిపోతున్నాయి.

"బాబూ! మీది కాకినాడేనా?" అందా మె కొద్దిగా తడబడే గొంతులో.

"అవును. మీకెలా తెలుసు మాది కాకినాడని" అన్నాను తాగడానికి ఎత్తిన కంచుగ్లాసు అలాగే పట్టుకుని.

"మీ మాటలనుబట్టి మీరా ప్రాంతంవా రై వుంటారని గ్రహించాను" అందామె. కానీ నేనామె మాటలు విశ్వసించలేకపోయా ను. ఏమంటే నేను బొంబాయి వెళ్లిపోయిన తరువాతనుండి నా-మాటే పూర్తిగా మారి పోయిందని మా ఇంట్లో అంతా రిమార్కు చేస్తుంటారు. మరీమె నాది కాకినాడని ఎలా గ్రహించిందో నాకు తెలియలేదు.

"కానీ ప్రస్తుతం కాకినాడలో ఎవరూ లేరు" అన్నాను.

"అయితే మీరు కాకినాడనుండి రావడం లేదా? మీరు కాకినాడ వెళ్లరా మరి?" అని గబగబా ప్రశ్నించిందామె.

"లేదు. నాకా ఊరితో సంబంధాలేవీ లేవు. ఎప్పుడైనా వెళ్లితే ఒక పూట వుండి వచ్చేస్తాను" అన్నాను.

"ఇంతకుముందు ఎప్పుడు వెళ్లారక్కడి కి?" అందామె.

"రెండు సంవత్సరాల క్రితం వెళ్లాను" అన్నాను.

"ఆ ఊరిలో కాలేజీ దగ్గర ఒక చిన్న భోజన హోటలు వుండాలి గుర్తుకుందా?" అందామె.

"అవును. ఒక పూరిపాకే కదూ! మూడు సంవత్సరాల క్రితం ఆ హోటలు నడిపే ముసలమ్మ చచ్చిపోవడంచేత ఎవరో ఒకతను పునాదులు తీశాడు. పునాదులేం? అక్కడొక ఇల్లుకూడా లేచినట్టు గుర్తు" అన్నాను గుర్తుకు తెచ్చుకుంటూ.

"ఆమె చచ్చిపోయిందా? ఆ విషయం మీకు బాగా తెలుసా?" అందామె వణికే గొంతుకతో.

"అంత క్రితం రెండు సంవత్సరాలనుం డి జబ్బుగా వుండేదని తెలుసు. ఆమెకు మా పినతండ్రిగారే మందిచ్చేవారు" అన్నాను యథాలాపంగా ఆమె ముఖంలోకి చూచి. చీకటిలో ఆమె కళ్లు కన్నీళ్లతో మెరిశాయి. నేనామెవైపు చూడడం మాని చీకటిలోకి ముఖం తిప్పుకుని వుండిపోయిందామె.

"ఏడుస్తున్నారా?" అన్నాను ఏమనాలో తెలియక.

"లేదు, లేదు. మజ్జిగ ఆ గ్లాసులో వుంచాను" అందామె గద్గద కంఠంతో.

నేనామెవైపు ఏం చేయాలో తోచని పరిస్థితిలో చూచాను. ఆమె కన్నీళ్లను తుడుచుకుంటూ "భోజనం చేయండి. అర్ధాకలితో లేచిపోతే నామీద ఒట్టే" అంది.

నేను మజ్జిగ అన్నంలో పోసుకోగానే ఆమె అక్కడినుండి లేచి వెళ్లిపోయింది. మజ్జిగన్నం తింటున్న నాకు బావిగిలక చప్పుడు వినిపించింది. ఆమె మనసుకు చెడువార్త చెప్పి కష్టం కలిగించాననుకుంటూ భోజనం పూర్తయిందనిపించాను.

భోజనం ముగించి నేను హాలులోకి రాగానే ఆరబెట్టుకుంటున్న జుట్టు ముడివేసుకుని "మీకా ప్రక్కగదిలో పక్క వేశాను. నిద్రపోండి. మీ బ్యాగుకూడా ఆ గదిలోనే వుంది. మంచినీళ్లు స్టూలుమీదున్నాయి" అందామె.

నేనామె చూపిన గదిలో నిద్రకు ఉపక్రమించాను.

"ఆమె ఎవరో నాకు తెలియదు. ఆమెకు కూడా నేనెవరో తెలిసే అవకాశం లేదు. అలాంటప్పుడు పస్తుండవలసిన ఒక రాత్రి — కాదు ఒక చలిరాత్రి — ఈమె నాకాతిథ్యాన్నిచ్చింది. ఎందుకు? బీదరికంలో కుమిలిపోతున్న ఈమెలో ఇంత సంస్కారం ఎక్కడనుండి వచ్చింది? ఈ ఇంటిలో ఇంకెవ్వరూ వున్నట్టు కనిపించదు. బహుశా భర్త విడిచిపెట్టేసి వుండాలి. ఆమె నుదుటిమీద కుంకుమ చూస్తే అంతే అనిపిస్తుంది' అనుకుంటూ నిద్రలోకి జారిపోయాను.

ఎక్కడో కోడి కూసింది.


మెలకువ వచ్చింది. మంచు తెరల్లోంచి సూర్యుడు తొంగిచూస్తున్నాడు. టైం చూసుకున్నాను. ఆరు గంటలైంది. కుట్టు మిషన్ నాకన్నా ముందులేచి తన పని చేసుకుని పోతున్నది. టూత్ బ్రష్ పట్టుకుని గది విడిచి వచ్చాను. ఆమె నా రాక గమనించి మిషన్‌ముందునుండి లేచి వంట ఇంటిలోకి వెళ్లింది నన్ను ముఖం కడుక్కోమని చెప్పి.

దేవుడి గదిలో కొండెక్కిన దీపాన్ని చూస్తూ బావి దగ్గరకు వెళ్లాను. ముఖప్రక్షాళనం పూర్తిచేసుకుని వచ్చేసరికి టేబుల్‌మీద కాఫీ, టిఫిన్ అమర్చి వుంచిందామె.

"మీరు ఎందుకో అనవసరంగా శ్రమ తీసుకుంటున్నారు" అన్నాను ఆమె ముఖంలోకి చూస్తూ. ఆమె ముఖంలో అలసట స్ఫుటంగా కనిపించింది నాకు. నిద్రలేక కాబోలు ఆమె కళ్లు ఎర్రబడ్డాయి. మనిషిలో, చేతలో నిర్లిప్తత స్పష్టమైంది నాకు.

"ఇందులో శ్రమ ఏముంది? పట్టణ జీవితాలకు అలవాటుపడ్డ మీకు కాఫీ, టిఫిన్లు

## నోట్లు



ఇంగ్లాండ్‌లో పోలీసులు 15 మిలియన్ పౌండ్ల దొంగనోట్లను ఒక పెద్ద ప్రెస్‌లో స్వాధీనం చేసుకున్నారు! కొత్తగా 50 పౌండ్ల నోట్లను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. ఆ కొత్త నోటును ఒకదానిని చీఫ్ క్యాషియర్ గ్రాహమ్ కెన్ట్‌ఫీల్డ్ పత్రికా విలేకరులకు చూపాడు. 15 సంవత్సరాల క్రిందట ప్రవేశపెట్టిన 50 పౌండ్ల స్థానంలో ఈ కొత్త నోటును ప్రవేశపెడుతున్నారు.

— కొడిమెల శ్రీరామమూర్తి

ఇక్కడ ఎక్కడా దొరకవు. అందుకే నేనే ఆ పని చేయాల్సి వచ్చింది. టిఫిన్ తీసుకోండి చల్లారిపోతున్నది" అందామె.

"కాకినాడ కాఫీ హోటలామె మీరేమవు తారు?" అన్నాను పెసరట్టు ముక్క తుంచుతూ.

జాకెట్టు గుండీలు కుడుతూ నేలమీద తలుపుకు చేరగిలబడి కూర్చున్న ఆమె నా ప్రశ్నని విని త్రుళ్లిపడింది. గుండీలు కుట్టటం ఆపేసింది. కొద్దిసేపాగి "నాకామె ఏమీ అవదు. ఆమె నాకు బాగా తెలుసు అంతే" తల ఆడిస్తూ తల దించేసి అందామె. ఆమె కంటిమండి కన్నీళ్లు టపటపరాలాయి.

"మీరేడుస్తున్నట్టున్నారు" అన్నాను.

"లేదు, లేదు" అందామె బుగ్గలమీద జారే కన్నీళ్లను గబగబా తుడుచుకుంటూ. కాఫీ కప్పువంక చూచి "చల్లారిపోతుంది. కాఫీ త్రాగండి" అందామె. "ఆమె కన్నీటితో చల్లబడిన నా గుండెకు ఆ కాఫీకి ఎంత వేడి వున్నా మాత్రం నాకేమాత్రం వేడినీయగలదు?" అనుకుంటూ కాఫీ గ్లాసు అందుకున్నాను.

స్నానం, ధ్యానం ముగించుకుని "నేను కోటపాలెం వెళ్లాలి. ఇప్పుడు బస్సు దొరుకుతుందనుకుంటాను" అన్నాను.

"అవును. మీరు నిన్నరాత్రి దిగిన చోటుకే వెడితే బస్సు దొరుకుతుంది" అందామె. బాగా దుఃఖించినట్టున్నదామె. మాటాడుతుంటే ఆమె గొంతుక బొంగురుపోతున్నది.

బ్యాగు తీసుకుని బయలుదేరబోతూ "నేను వెళ్లిపోతున్నాను. మీరు చూపిన దయకు ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియడంలేదు. ఈ కొద్దిపాటి సొమ్ము తీసుకుని మీ కష్టాన్ని తీర్చుకోనివ్వండి" అని ఇరువది రూపాయల నోటు టేబుల్ మీద వుంచాను. నిజానికి ఆమె ఆదరాభిమానాలకు ఆ సొమ్ము సరిపోదని నాకు తెలుసు.

"మీకెలా చెప్పాలో నాకు తెలియడంలేదు. నేనొక అతిథికి ఆతిథ్యమిచ్చాను. అంతేగాని నేనేమీ హోటల్ నడపడంలేదు. క్షమించండి నా మాటలకు. డబ్బును తీసేసుకోండి" అన్నదామె.

"నావల్ల మీకు శ్రమేకాక, మనసుకు బాధ కలిగింది. దానికి ఏ విధంగానైనా నాకూరట కలగనీయండి" అన్నాను.

"మీరన్న శ్రమ, బాధలు ఈ నాటివి కావు. అవి జీవితాంతం వుండవలసినవే. దానికి మీరేమీ చేయలేరు. మిమ్మల్ని ఆదరించడంలో నా స్వార్థం లేకపోలేదు. మీరిలా రావడం నా అదృష్టం! మీరనుమతిస్తే మీతో ఒక అరగంట మాట్లాడాలి" అందామె.

గడియారం చూచాను. టైం ఏడున్నర అయింది. "బస్సుకి అరగంటే టైముంది" అన్నాను.

"మీరు అయితే ఇటు మళ్లీ రారా?" అందామె కంగారుగా.

"తిరుగు ప్రయాణంలో నేనిటే వస్తాను" అన్నాను.

"అయితే తప్పక ఇక్కడే దిగండి. మరచిపోవద్దు. మీకోసం ఎదురుచూస్తుంటాను. పాప పుణ్యాలనేవి వుంటే మీరు ఒక పుణ్యం చేసినవారవుతారు" అందామె.

"తప్పక దిగుతాను" అని ఆమెదగ్గర సెలవుతీసుకుని బస్సు ఆగేవైపు నడిచాను.

□ ■ □


మధ్యాహ్నం పన్నెండయ్యేసరికి బస్సు కోటపాలెం చేరింది. కోటపాలెం కొద్దిగా పెద్ద ఊరే! బస్సు దిగుతూనే ప్రభాకరరావు గారింటికి వెళ్లాలని చెప్పాను. డ్రైవర్ ఒక బండివాడిని పిలిచి ఏదో చెప్పాడు. వాడు మారు మాటాడక నన్ను బండిలో ఎక్కించుకుని బయలుదేరాడు. ఊరిలో చాలా పెంకుటిళ్లు వున్నాయి. ఆ ఊరిలోకల్లా పెద్ద మేడ హోదా వున్నవాడు మా ప్రభాకరే అట. ఆ ఊరి పంచాయతీకి ప్రెసిడెంట్ మా ప్రభాకరే అట. వాడు ప్రెసిడెంట్ అయిన తరువాతే ఆ ఊరికి ఎలక్ట్రిసిటీ వచ్చిందట. బండివాడి మాటలవల్ల ప్రభాకర్ చాలా పలుకుబడి వున్నవాడని తెలిసింది. బండి ప్రభాకర్ ఇంటిముందాగింది.

నన్ను చూడగానే ప్రభాకర్ అత్యంతానందంతో ఆహ్వానించాడు. నా వెంట వుండి నా అవసరాలన్నీ చూచాడు. నే భోజనం చేయగానే నన్ను విశ్రాంతి తీసుకోమని చెప్పి వెళ్లిపోయాడు.

నేను నిద్ర లేచేసరికి నాలుగైంది. నేను మేడదిగి క్రిందకు వెళ్లేసరికి ప్రభాకర్ సావిడిలో చాలామందితో ఏదో విషయాన్ని గూర్చి చర్చిస్తున్నాడు. నన్నుచూచి తన ఆప్తమిత్రుడిగా అందరికీ పరిచయం చేశాడు. వారిని క్లుప్తంగా గ్రామ పాలకవర్గంగా పరిచయం చేశాడు. కొంతమంది వాడి దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయారు. ప్రభాకర్ తోపాటు, అతని కొందరు మిత్రులు, అతని బావమరిది రంగారావు, నేనూ మిగిలాము. కాఫీ, టిఫెన్ పట్టించుకుని వచ్చినామెను తన శ్రీమతి పార్వతిగా పరిచయం చేశాడు. ఆమె నమస్కరిస్తే నేను ప్రతినమస్కారం చేశాను.

అందరం కాఫీ, టిఫెన్ తీసుకున్నాము. "మీ ప్రయాణం సుఖంగా జరిగిందా?" అని పార్వతీదేవి పరామర్శించింది నన్ను.

"ఏం సుఖమో 'అలవైకుంఠపురిలో' అన్నట్టు ఒక సరియైన బస్సు, తిన్నని బాటలేని ఈ మారుమూలం తిష్టవేశాడు



ప్రభాకర్. నిన్నరాత్రి రాజుపాలెంలో చాలా బాధలు పడేవాడినే'' అన్నాను.

''అవును. ఆ ఊరిలో పచ్చి మంచినీళ్లయినా పుట్టవు'' అన్నాడు ప్రభాకర్ మిత్రుడొకడు.

''కాని ఒకామె నాకు చాలా మర్యాదలు చేసి ఆతిథ్యమిచ్చింది'' అన్నాను. ఆమెకై నాలో నిండివున్న కృతజ్ఞతను తెలియపరచడానికి అంతకన్నా ఎక్కువ అవకాశం దొరకలేదు.

''ఎవరామె?'' అన్నాడొక మిత్రుడు కుతూహలంగా.

''ఎవరో ఒక పాతికేళ్ల స్త్రీ. పాపం చాలా బీదది. కుట్టు మిషన్ మీద బ్రతుకుతోంది' అన్నాను.

మా ప్రభాకర్ నా మాటలు విని పెళ్లున నవ్వాడు. మిన్ను విరిగి మీద పడ్డట్టు ఉలిక్కిపడ్డాను. అతనితోపాటూ అతని మిత్రులు శ్రుతికలిపారు.

నేను తెల్లబోయాను.

ప్రభాకర్ నన్నుచూసి నవ్వాపి ''నీవనేది సన్నగా తెల్లగా వుండే ఆవిడ గురించేనా? ఆమెది పొడవైన నొక్కులజుత్తుకదూ?'' అన్నాడు.

''అవును'' అన్నాను హీనస్వరంతో.

''ఆమె కుడికంటికింద పుట్టుమచ్చ వుంటుంది. అవునా?'' అన్నాడు.

ఆమె రూపాన్ని గుర్తు తెచ్చుకుంటూ ''అవును'' అన్నాను.

ప్రభాకర్ నవ్వుతూ, కుడిచేతి చూపుడు వేలు పైకి కిందికి గాలిలో ఆడిస్తూ తన మిత్రులవైపు చూచి ''సందేహం లేదు. అనసూయే'' అని అన్నాడు.

''ఆమె నీకు తెలుసా?'' అని అడిగాను కొద్దిగా ధైర్యం తెచ్చుకుని.

పార్వతీదేవి ముఖం జేవురించింది. ప్రభాకర్ ఆమె ముఖంలోని రంగులు గమనించక పోలేదు.

''ఆమెతో పరిచయం లేదు. కాని ఆమె గూర్చి విన్నాను. ఆమె మహా పతివ్రత'' అన్నాడు.

''ప్రభాకర్!'' అన్నాను అప్రయత్నంగా.

''ఆమె గురించి ఈ ప్రాంతంవారికి తెలియకపోవచ్చు. కాని కాకినాడలో ఆమె పెద్ద...'' అన్నాడు.

''ఈ ప్రాంతంలో ఆమెగూర్చి తెలియని వారెవరు?'' అన్నాడు ప్రభాకర్ మిత్రుడు.

''నీకు బాగా తెలుసా ఆమె గురించి'' అన్నాను.

''నాకు తెలియడంలో ప్రత్యేకత లేదు. అందరికీ తెలిసినట్టే నాకూ తెలుసు. ఆమెది కాకినాడ. అక్కడామె తల్లి హోటల్ పెట్టి నడిపేది. అప్పుడీమెగారు ఒక కాలేజీ కుర్రాడిని వలలో వేసుకుని వాడితో పారిపోయింది. పోనీ వాడితోనైనా వుందా? లేదు. వాడిని నమ్మించినట్టే నమ్మించి ఎక్కడికో ఎవరినో పట్టుకుని పారిపోయింది. రెండు సంవత్సరాల క్రితం రాజుపాలెం చేరింది. తన పాలన అక్కడ సాగిస్తోంది. మరి అలాంటి స్త్రీ నీకు ఒక రాత్రి ఆతిథ్యమిచ్చిందంటే... అవునులే. నీలాంటి వాడికివ్వక ఇంకెవ్వరికిస్తుంది?'' అన్నాడు ప్రభాకర్.

''ప్రభాకర్, నీవు చాలా పొరపాటు పడ్డావు. ఆమె అలాంటి స్త్రీలా నాకు కనిపించలేదు'' అన్నాను.

''నీవొక ప్రవరాఖ్యుడిలా వున్నావు. నీకు ఆమె అర్థంకావడం కష్టమే. అయినా మనిషి

న్నా మాచి, మనిషి మంచి చెడ్డలు అంచనా వేయగలమనుకున్నావా? పొరపాటు పడ్డావు'' అన్నాడు కుర్చీ వెనుకకు చేరగిలపడుతూ.

''మనం కనులారా చూచిన విషయాల్లో అన్నీ ఎల్లవేళలా నిజాలుకావురా ప్రభా! చెప్పుడు మాటలుకూడా అంతే. ఎవరో ఒకరు చెప్పిన విషయాన్ని ఆధారంగా తీసుకుని ఆమెకు 'మహా పతివ్రత' అని బిరుదు తగిలించడం మంచిది కాదురా ప్రభా!'' అన్నాను హెచ్చరించే ధోరణిలో.

''అవును. ఒక రాత్రి ఆమె గురించి తెలిసినవాడివి నీవు. నీకన్నా నలుగురు చెప్పగా విన్నవాడిని నేను. నీకన్నా నాకేమిటి బాగా తెలుస్తుంది. ఆమెను పతివ్రత అనడం చాలా పొరపాటు'' అన్నాడు.

అతని మాటల్లో వ్యంగ్యం నాకర్థమైంది. అతనికి తగిన సమాధానమీయదలుచుకున్నాను. కాని అతనితో వాదానికి దిగడం నాకిష్టంలేకపోయింది.

''నీతో దెబ్బలాడడానికి అంతదూరంనుండి రాలేదు ప్రభా'' అన్నాను.

ప్రభాకర్ కొద్దిగా చలించాడు. ''ఎవరి అభిప్రాయాలు వారివిరా ప్రభా! నీకున్న అభిప్రాయం మార్చడం నా ఉద్దేశ్యం కాదు. ఏదో ఉద్రేకంలో వాదించాను. నీతో ఇంతవరకూ వాదించినందుకు క్షమించు. పరాయి స్త్రీ గురించి మనకు వాదనవద్దు'' అన్నాను.

ప్రభాకర్ ముఖం జేవురించింది.

''మురిసి కబుర్లు చెప్పకు. ఆమెను గురించి చెప్పగలిగినవారు ఈ ఊరునిండా వున్నారు: చిన్నప్పటినుండి నీ తత్వమే అంత. నీవు పట్టిన కుందేలుకు మూడే కాళ్లంటావు. నీతో వాదించడం పొరపాటు'' అని పార్వతీ దేవి వంక తిరిగి ''పార్వతీ! మన బాబు ఏడి?'' అన్నాడు.

ఆమె బాబును తేవడానికి వెళ్లింది.

ప్రభాకర్ ప్రవర్తన గూర్చి చింతన చేస్తుండగా ఆమె బాబును తీసుకొచ్చింది.

## వందరోజులు

''మీ పిక్చర్ వందరోజులు పూర్తయినట్లుగా ప్రకటించారుగదా! ఎన్ని కేంద్రాల్లో''

''ప్చ్! ఒక్క కేంద్రంలో కూడా వడలేదు. కానీ మా చిత్రం విడుదలై వందరోజులు. అందుకే అలా ప్రకటించాం''

— బి.వి.ఎస్.బాబు (తెనాలి)



బాబును చేతిలోకి తీసుకుని నేను తీసుకెళ్లిన గొలుసు వాడి మెడలో వుంచాను.

మరి రెండు రోజులు ఆ ఊరిలో వుండి, అక్కడినుండి మా స్వగ్రామానికి బయలుదేరాను. నాతోపాటు పార్వతి అన్నగారు రంగారావుకూడా బయలుదేరాడు. ప్రభాకర్ మమ్మల్ని సగౌరవంగా సాగనంపాడు. రంగారావు తాను రాజుపాలెం వస్తున్నట్టూ, అక్కడ తనకేదో పనులున్నట్టూ బస్సు ఎక్కుతూ చెప్పాడు. మా బస్సు ఐదు గంటలవుతుండగా రాజుపాలెం చేరింది. నేను అక్కడ దిగడమా అని బాగా ఆలోచించాను. ఏమైనా ఆమెకు మాట ఇచ్చాను కనుక అక్కడ దిగడమే శ్రేయమని రంగారావుతోపాటు దిగాను.

శీతాకాలం కనుక ఐదు అవుతుండగానే సూర్యుడస్తమించాడు. నేను రంగారావుతో "నేను అనసూయగారింటికి వెడుతున్నాను" అన్నాను. రంగారావు ఆ మాటకు "నాకూ ఈ ఊరు కొత్తే. నేనీ రాత్రి ఎక్కడో తలదాచుకుని, రేపు పనులు చూచుకుని కోటపాలెం వెళ్లిపోతాను" అన్నాడు.

"మీకే ఊరు కొత్తదైనప్పుడు చలిలో ఎక్కడో బాధపడడం ఎందుకు? అనసూయగారు మనకు తలదాచుకోటానికి చోటు చూపలేకపోరు. రండి వెడదాం" అన్నాను.

"నేనెందుకండీ మీ మధ్య" అన్నాడు అతను.

అతని మాటలలో అర్థం నాకు తెలియకపోలేదు. నిజానికి నాకు కోపమే వచ్చింది. కాని కోపాన్ని వ్యక్తం కానివ్వక "మీరనుకునేంత పెద్దదికాదామె. అక్కడికి వెళ్లగానే వెడిపోము. మనసు మంచిదైతే మననేం చేయలేరు ఎవరూ. రండి" అన్నాను. అతన్ని ఆహ్వానించడంలో ఆమె సత్ప్రవర్తన అతనికి చూపించాలనే కోరిక నాలో బలీయమవడమే కారణం.

అతనేదో గొణుక్కుని 'పదండి' అన్నాడు.

ఇద్దరం అనసూయగారింటికి చేరాము. ఆమె మమ్మల్ని ఆప్యాయంగా ఆహ్వానించింది. రంగారావుని నా స్నేహితుడిగా పరిచయం చేశాను. ఆమె అతనికి చాలా మర్యాద చేసింది. ఆమె తన పని ఆపి వంట ప్రయత్నంలో మునిగింది. రంగారావు బావి దగ్గర స్నానం చేయడానికి వెళ్లాడు.

నేను ఆమె వున్న వంటగదిలోకి వెళ్లాను. నేను వెళ్లేసరికి ఆమె ఎసట్లో బియ్యం పోస్తూ వస్తు చూసింది. ఆమె చూపుల్లో అంతంకన్నా అమాయకతే ఎక్కువగా గోచరమైంది నాకు. ఆమెకు దగ్గరగా వెళ్లి "మీరేదో మాట్లాడాలని అన్నారు" అన్నాను.

"అవును. ఇంతవరకూ మీతో మాట్లాడాలనే అనుకున్నాను. కాని మీ మిత్రులు వుండగా మీతో నేనా విషయం చర్చించడం బాగుంటుందని నాకనిపించడంలేదు. మీతో చెప్పవలసినదేదో ఉత్తరంలో వ్రాసి ఇస్తాను. దానిని ఎలాగైనా నేను చెప్పిన వ్యక్తికి అందజేయాలి. ఆ వ్యక్తి మీకు బాగా తెలుసు. అతని ఫోటోకూడా మీకు ఇస్తాను" ఆ ఉత్తరంలో విషయాలు మీకు తెలిసినందువల్ల మాకు నష్టమేమీ లేదు. మీరా ఉత్తరాన్ని ఆయనకందించి నాకు ఉపకారం చేసిపెట్టండి" అంది.

"తప్పకుండా చేస్తాను" అన్నాను ఆరిపో

యిన పొయ్యిలోని క్రొరసుండొచ్చే పొగను తప్పించుకుంటూ.

"జీవితంలో ఊహించనివిధంగా మీరు నాకు తారసపడ్డారు. మీరీపాటి ఉపకారం చేస్తే మీ ఉపకారం జన్మజన్మలకు మరచిపోను. స్త్రీనైపుట్టి నేను నా దురదృష్టాన్ని ఏవిధంగానూ చెప్పుకోలేను. మీరు చేసే మేలుకు పేదరాలినైన నేను ప్రస్తుతానికి ఏవిధంగానూ ఋణం తీర్చుకోలేను. కాని ప్రతి స్త్రీకి లభ్యమయ్యేది నాకూ లభ్యమైన రోజు మీరెక్కడున్నా మీ ఋణం తీర్చుకుంటాను'' అందామె. ఆమె మాట్లాడుతుంటే కంఠం బొంగురుపోయింది. ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.


"జరిగినదానికి బాధపడకండి. మీకు నాచేతనైనంత సహాయం చేస్తాను'' అన్నాను అనునయించే గొంతుతో.

"మీరెంత మంచివారు'' అందామె. ఆమె గొంతుకలో కృతజ్ఞత తొణికిసలాడింది. రంగారావు రావడంచేత మా ప్రసంగం అంతటితో ఆగిపోయింది.

ఏడు గంటలు కాకమునుపే భోజనాలు ముగించాము. ఆమె తన కుట్టుపనిలో నిమగ్నురాలైంది. తొమ్మిది గంటలవరకూ రంగారావు తనకు తెలిసిన దెయ్యాలగురించి చెప్పాడు. నాకు దెయ్యాలగురించి ఏమీ తెలియదు కనుక 'ఊ' కొట్టాను.

తొమ్మిదిన్నర కాగానే నిద్రకుపక్రమించాము. నేను రంగారావు నేలమీద ఒక గదిలో పడుకున్నాము. ఆమె దేవుని గదిలో పడుకుంది. నాకు పదకొండు గంటలవరకూ నిద్ర రాలేదు. ఎలాగో కొద్దిసేపట్లో నిద్రపట్టింది. ఆ మగత నిద్రలో ఎవరో కేకవేసినట్టనిపించింది. గభాలున లేచి దీపం పెద్దది చేసి చూచాను. రంగారావు ప్రక్కమీద లేడు. ఇంటిలో ఏదో గలాభా జరుగుతున్నట్టు అలికిడి అయింది. హరికేన్ లాంతరు పుచ్చుకుని కేక వినిపించిన దేవుడి గది దగ్గరికి వెళ్లాను. దగ్గరగా వేసి వున్న తలుపుల్లోంచి, గదిలో ఒక మూల భయంగా

## వెల్లుల్లి గొలుసు



వెల్లుల్లి ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుత సహజ రసాయనం! డాక్టర్లు చెప్తున్నదాన్నిబట్టి వెల్లుల్లి కనీసం 80 వ్యాధుల్ని తగ్గిస్తుంది. అయితే ఈ మధ్యనే జరిగిన పరిశోధనలలో వెల్లుల్లిపాయంతో నెక్లెస్ తయారుచేసి దాన్ని మెడలో వేసుకుంటే శరీరంలోని అంటువ్యాధులు, సూక్ష్మజీవులు నశించడమేగాక 'రక్తపోటు'కూడా కంట్రోల్‌లో వుంటుందని వెల్లడైంది! వెల్లుల్లిలో వుండే 'అల్‌సిన్' అనే రసాయనానికి వుండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ ధర్మంవల్లన ఇది సాధ్యపడుతుంది! థాంక్స్ టూ వెల్లుల్లీ!!

— జూపిటర్

నిల్చున్న ఆమె — ఏదో అడుగుతున్న రంగారావూ కనిపించారు.

"డాబులు చెప్పకు. నీ గురించి బాగా తెలుసు నాకు. నీ పాతివ్రత్యం నా దగ్గర చూపించకు" అంటున్నాడు రంగారావు.

"ఆగండి. ఒక రాత్రి నీడ చూపినందుకు మీరు చూపే ప్రతిఫలం ఇదేనా చదువుకున్నవారు. వెళ్లండి దయచేసి. నా జోలికి రాకండి" అందామె.

"అల్లరి చేయకు. మంచిగా నా మాట విన్నావా సరేసరి. లేదా!..." అంటూ ముందుకు అడుగువేశాడు రంగారావు.

"బలమున్నదని అబలమీద ప్రయోగించకండి. వెళ్లండి" అందామె.

"అయితే మాట వినవన్న మాట. ఆగు" అంటూ గబగబా ఆమె ముందుకు వెళ్లాడు రంగారావు. ఆమె కేకలేస్తుంటే ఆమెను గట్టిగా పట్టుకున్నాడు. ఆమె గట్టిగా అతని ముఖంమీద శక్తివంచన లేకుండా ఉమ్మేసింది.

నా కోపం అవధులు దాటింది.

"మిస్టర్ రంగారావ్. ఆగు" అని గట్టిగా అరిచాను గది తలుపులు తెరిచి. దీపపు వెలుగులో నన్ను చూచిన రంగారావు ఆమెను వదిలివేశాడు.

"రాజుపాలెంలో మీకున్న పని ఇదేనా? మడికట్టుకున్నవానిలా కబుర్లు చెప్పారు. ఇదేనా పెద్ద మనిషి తరహా!" అన్నాను.

ఆమె భయంగా నేలమీద పడి ఏడ్వనారంభించింది.

రంగారావు దిక్కుతోచక నావైపు చూడలేక నేలచూపులు చూస్తూ నిలబడ్డాడు.

"మీ బావగారి ముఖం చూచి వదిలిపెడుతున్నాను. ఈ క్షణమే 'క్కడనుండి వెళ్లిపోండి. నాకు కోపం ఎక్కువైతే నేనేం చేస్తానో నాకే తెలియదు. వెళ్లండి" అన్నాను

నా రౌద్రాకారం చూచి రంగారావు మారుమాటాడక వెళ్లిపోయాడు. అతన్ని అవతలికి పంపించి, ఆమె వున్న గదిలోకి ప్రవేశిస్తూ "లేమ్మా!" అన్నాను, "ప్రభూ! ఎంతకాలం పరీక్షిస్తావు? ఇంకా నాపై దయరాలేదా?" అని కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తూ దేవుడి పటానికి ప్రక్కనే తగిల్చి వున్న ఫోటోముందు ఏడుస్తున్న ఆమెతో.

దీపపు వెలుగులో ఆ గదిలోకి ప్రవేశిస్తున్న నాకు ఆ ఫోటో స్పష్టంగా కనిపించింది. నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. ఆ ఫోటోలో అనసూయతో పుష్పమాలాలంకృతుడై వున్న వ్యక్తిని చూచి నివ్వెరపోయాను.

అతడే ఈమె ఆరాధ్య దేవత.

అతడే ఈమె సర్వస్వం.

అతడే ఈమెకు కట్టుకున్న భర్త.

అతడే మా ప్రభాకర్.

నివ్వెరపోయిన నన్ను నేను మా ప్రభాకర్ భుజాలమీద చేతులు వేసుకుని నవ్వుతూ తీయించుకున్న ఫోటో వెక్కిరించింది.